



# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)







Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 05 సంచిక : 26 | బుధవారం 25 ఫిబ్రవరి 2026 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695


## కోఠి కాల్పుల కేసు ఛేదనం నిందితులందరూ అరెస్ట్





## మంచు తుఫానుతో అమెరికా అతలాకుతలం..





## బంగ్లాలో ఆర్మీలో భారీ మార్పులు.. ఇండియాలోని అధికారికి ప్రమోషన్!




## ఇన్ఫోసిస్‌లో రూ. 17 లక్షల ప్యాకేజీ.. బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి సూసైడ్





## ఎయిర్ అంబులెన్స్ కూలిన ఘటనలో ఏడుగురు మృతి..




## "ఫేక్ న్యూస్‌పై ట్రంప్ ఫైర్.. జనరల్ కేన్‌పై ప్రశంసల జల్లు!




## అన్‌లిస్టెడ్ కంపెనీల జాబితాలో రిలయన్స్ రిటైల్ అగ్రస్థానం




# భూదాన భూముల్లో హై టెన్షన్

## తమ ఇళ్లను తొలగించొద్దంటూ బాధితుల వేడుకోలు

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (కెరటం న్యూస్): ఖమ్మం కలెక్టరేట్ సమీపంలో గల 60 ఎకరాల భూదాన భూమిలో హై టెన్షన్ వివాదం నెలకొంది. 2014లో 62 ఎకరాల భూదాన భూమిలో దాదాపు 18 ఎకరాల్లో 600 కుటుంబాలు రెండు వేల జనాభా ఇండ్లు లేని నిరుపేదలు ఇండ్లు నిర్మించుకొని అక్కడ నివసిస్తున్నారు. తమ నిర్మించుకున్న భూమికి పట్టాలు ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతూ అధికారులకు విన్నవించుకున్న పట్టాలు ఇవ్వడం లేదని కానీ, అదే భూమి పక్కన రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వ్యాపారాలను కొనసాగిస్తుండగా, మరోవైపు కబ్జాదారులు అధికారులు సైతం వారికి కొమ్ముకాస్తున్నారని భూదాన బాధితులు ఆరోపిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి వందలాది మంది పోలీసు బలగాలతో మున్సిపల్ సిబ్బంది వందల ట్రాక్టర్లు జెసిబిలతో భూదాన భూమి ఆవరణలోకి చేరుకున్నారు.

వందలాది పోలీసులు ఒక్కసారిగా భూదాన భూముల్లోకి అడుగుపెట్టడంతో స్థానికంగా నివసిస్తున్న పేద ప్రజలు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. తము నిర్మించుకున్న ఇండ్లను తొలగించవద్దని అధికారుల కాళ్ళ వేళ్ల పడ్డ కనికరించకుండా రేకుల షెడ్డు గుడిసెలను జెసిబి లతో తొలగించడంతో స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. స్థానికులు సైతం పోలీసులకు ఎదురు పడటంతో




ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వందల ఎకరాల భూములు రాజకీయ నాయకులు కబ్జా చేస్తున్నప్పటికీ వారిని పట్టించుకోకుండా ఇండ్లు లేని నిరుపేదలు ఇండ్లు నిర్మించుకొని నివసిస్తుంటే నిరుపేదల గుడిసెలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ధాక్షణ్యంగా కూల్చివేస్తుందని బాధితులు వాపోతున్నారు.

## మూసీ నది ఒడ్డున గాంధీ విగ్రహ ఏర్పాటు

- భూసేకరణపై వివాదం
- తుషార్ గాంధీ ట్వీట్ వైరల్
- సీఎంను ట్యాగ్ చేసిన తుషార్
- నిర్వాసితుల ఆందోళన
- నిర్ణయం పునరాలోచన డిమాండ్




# దేవాదుల సాక్షిగా పరిష్కారం

## సీఎం రేవంత్ రెడ్డి



- కృష్ణా-గోదావరి జలాలపై చర్చల ద్వారానే శాశ్వత పరిష్కారం
- పంచాయితీలకు బదులు స్నేహపూర్వక చర్చలకే సీఎం ప్రాధాన్యం
- ప్రతి పౌరుడికి తాగునీరు - ప్రతి ఎకరాకు సాగునీరు లక్ష్యం
- జలాల సాధనలో రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం
- కృష్ణా జలాల్లో సమాన వాటా కోసం తెలంగాణ డిమాండ్
- శ్రీశైలం-నాగార్జున సాగర్ నిర్వహణపై మళ్లీ వివాదం
- కాళేశ్వరం, పోలవరం ప్రాజెక్టులపై పరస్పర అభ్యంతరాలు
- జల వివాదాలపై ఏపీ స్పందన ఎలా ఉంటుందో ఆసక్తి

మిగతాది 2 లో

**న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (కెరటం న్యూస్)**

తెలుగు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా నెలకొన్న కృష్ణా, గోదావరి జలాల పంపిణీ అంశాలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. జల సాధనలో ఘర్షణల కంటే చర్చల ద్వారానే శాశ్వత పరిష్కారాలు సాధ్యమని, ప్రజా ప్రయోజనాలే పరమావధిగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని పలువురు మేధావులు సూచిస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా ట్వీట్ చేశారు. దేవాదుల సాక్షిగా కృష్ణా, గోదావరి జలాల సాధనలో వివాదమా, పరిష్కారమా అంటే తాము పరిష్కారం కోరుకుంటామని అన్నారు. చర్చలా, పంచాయితీనా అంటే తాము చర్చలే కోరుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడికి తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు అందివ్వడమే తమ ప్రభుత్వం మందున్న టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

## ఘోర అగ్నిప్రమాదం ఒకే ఇంట్లో ఆరుగురు సజీవదహనం

- మీరట్ లో విషాదం
- ఆసుపత్రిలో మృతిగా ధ్రువీకరణ
- షార్ట్ సర్క్యూట్ అనుమానం
- పోలీసుల దర్యాప్తు ప్రారంభం




## బార్పేటా రోడ్‌లో సినిమా తరహా దోపిడీ..

- 12 కోట్ల విలువైన నగలు మాయం
- అస్సాంలో సంచలనం
- 'సెన్కో అలంకార్' షోరూమ్ టార్గెట్
- సీసీటీవీ హార్డ్‌డిస్కులు ఎత్తుకెళ్లారు
- నలుగురు అరెస్ట్.. ఒకరు పరారీ




# మోడీ సిగ్గుపడాల్సిన అంశాలు బోలెడున్నాయి

## రాహుల్ గాంధీ మాస్ ర్యాగింగ్

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (కెరటం న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి నిప్పులు చెరిగారు. ప్రధాని తన ప్రసంగాల్లో 'సిగ్గుపడాల్సిన విషయం' గురించి మాట్లాడుతున్నారని, కానీ అసలు సిగ్గుపడాల్సిన అంశాలు తన వద్ద ఉన్నాయంటూ రాహుల్ గాంధీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వేదికగా ట్వీట్ చేశారు. అంతర్జాతీయ నేరస్థుడు ఎప్‌స్టీన్ ఫైల్స్ లో ప్రధాని మోదీ, ఆయన మంత్రి, ఆయన సన్నిహితుల పేర్లు ఉండటంపై రాహుల్ తీవ్రంగా స్పందించారు. అంతటి దారుణమైన నేరస్థుడితో మోడీ పేరు ముడిపడి ఉండటం దేశానికే సిగ్గుచేటని మండిపడ్డారు. అమెరికాతో కుదుర్చుకున్న ట్రేడ్ డీల్స్ ద్వారా దేశ డేటాను తాకట్టు పెట్టారని, రైతులను, టెక్స్‌టైల్ పరిశ్రమను సర్వనాశనం చేశారని రాహుల్ ఆరోపించారు. అమెరికాతో చేసిన డీల్‌లో దేశ ప్రయోజనాలను అమ్మేశారని.. ఇది సిగ్గుపడాల్సిన విషయం కాదా అని ప్రశ్నించారు.

గౌతమ్ అదానీ పై అమెరికాలో నడుస్తున్న కేసు




ప్రధాని మోదీ నిద్రను దూరం చేసిందని రాహుల్ కామెంట్ చేశారు.అదానీపై కేసు అంటే అది బీజేపీ ఆర్థిక వ్యవస్థపై పడిన కేసు అని, అందుకే 14 నెలలుగా దానిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ధ్వజమెత్తారు. 'మోదీ గారూ.. మీరు మీ మిత్రులైన అనిల్ అంబానీ, అదానీ కోసం మీకు నచ్చింది చేసుకోండి. కానీ నేను, కాంగ్రెస్ పార్టీకి చెందిన బబ్బర్ షేర్లు దేశ రక్షణ కోసం పోరాడుతూనే ఉంటాం. మేము ఒక్క ఇంచు కూడా వెనక్కి తగ్గం' అంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు.

## 26/11 నిందితుడు తహావూర్ రాణాకు కెనడా షాక్

# పౌరసత్వం రద్దుకు రంగం సిద్ధం!




న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (కెరటం న్యూస్): ముంబయి 26/11 ఉగ్రదాడి నిందితుడు తహవూర్ రాణాకు బిగ్ షాక్ తగలబోతున్నట్లు తెలుస్తోంది. తహవూర్ రాణా పౌరసత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను కెనడా ప్రభుత్వం ప్రారంభించింది. ఎల్లుండి భారత పర్యటనకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ రాబోతున్న వేళ ఈ పరిణామం ఆసక్తిగా మారింది. కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో హయాంలో దెబ్బతిన్న భారత్-కెనడా సంబంధాలను పునరుద్ధరించేందుకు, ప్రస్తుత కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఫిబ్రవరి 26న భారత్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు ముందే కెనడా ఈ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం. పాకిస్థాన్‌లో జన్మించిన రాణా ప్రస్తుతం తిహార్ జైల్లో ఉన్నాడు. లష్కరే తోయిబా ఆధ్వర్యంలో జరిగిన ముంబై దాడుల కేసులో ఆయన విచారణను ఎదుర్కొంటున్నాడు.

# భూదాన భూముల్లో హై టెన్షన్

## తమ ఇళ్లను తొలగించొద్దంటూ బాధితుల వేడుకోలు

మొదటి పేజీ తరువాయి

గత పది సంవత్సరాలుగా ఇక్కడే ఎండ కి ఎండుతూ వానికి తడుస్తూ ఇక్కడే జీవనం గడుపుతున్నామని అలాంటి మా గుడిసెలను అక్రమంగా ఆర్మీ సైన్యం మోహరింపుతో గుడిసెలను తొలగించడం సరైనది కాదని వెంటనే తమకు ఇండ్లు నిర్మించి ప్రభుత్వం ఇవ్వాలని లేని ఎడల ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.

మీడియాకు అనుమతి ఇవ్వని పోలీసులు.. భూదాన భూముల్లో ఇండ్లను తొలగిస్తున్న వార్త కవరేజ్ కి వెళ్ళిన మీడియాను పోలీసులు అడ్డగించడంతో పోలీసులకు మీడియాకు కొంత ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఆక్రమణల తొలగింపు కవరేజ్ కి వచ్చిన మీడియాను ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని మీడియా ప్రశ్నించడంతో పోలీసులు చాలాసేపటి వరకు వివాదం జరగడంతో అప్పుడు కొంత సడలింపు ఇవ్వడంతో మీడియా కవరేజ్‌కి వెళ్లడం జరిగింది. ప్రభుత్వం ఆక్రమణలను తొలగించాలంటూ స్టే ఇచ్చినట్లుగా అధికారులు చెబుతున్నప్పటికీ స్టే ఆర్డర్ ను ఎవరికి చూపించకపోవడం గమనార్హం. ప్రభుత్వం మొండి వైఖరి అధికారుల నిర్లక్ష్యం కారణంగా 200 మంది రోడ్డున పడాల్సి వస్తుంది, ఇటీవల చీఫ్ జస్టిస్ చంద్రకుమార్ ఖమ్మం వచ్చి భూదాన భూమి ఆవరణలో నివసిస్తున్న పేదలను పరిశీలించి అక్కడ భూమి జోలికి ఎవరు వెళ్లొద్దంటూ కలెక్టర్‌కు సైతం ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. భూదాన భూమిలో ఇళ్లను తొలగించడంతో స్థానికులు కన్నీరు మున్నీరై ఇంట్లో సామాన్లు సర్దుకుని రోడ్లపైనే వర్షానికి తడుస్తూ నిలబడి కన్నీరు మున్నేరు కారుస్తున్నారు.

# కోఠి కాల్పుల కేసు ఛేదనం నిందితులందరూ అరెస్ట్

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (కెరటం న్యూస్): హైదరాబాద్‌లో అత్యంత రద్దీ ప్రాంతమైన కోఠి ఎస్‌బీఐ ఏటీఎం వద్ద కేరళ వ్యాపారిపై కాల్పులు జరిపి నగదు దోచుకున్న కేసును తెలంగాణ పోలీసులు ఛేదించారు. తాజాగా నిందుతులందరినీ టాస్క్‌ఫోర్స్ టీమ్ అదుపులోకి తీసుకుంది. ఈ మేరకు నిందితుల నుంచి ఓ వెపన్ కూడా రికవరీ చేశారు. ఫిబ్రవరి 16న కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరిని ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ పోలీసులు హర్యానా లో చాకచక్యంగా పట్టుకున్నారు. అతడు ఇచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం ఉత్తరప్రదేశ్‌లో గాలించగా అతడిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. దీంతో కేసులో నిందితులంతా పట్టుబడినట్లైంది. ఈ మేరకు వారిని మంగళవారం మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

కాగా, కేరళకు చెందిన వస్త్ర వ్యాపారి రిన్షద్, వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి నాంపల్లి లో ఉంటున్నారు. జనవరి 31న ఉదయం సుమారు 7 గంటల సమయంలో కోఠిలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఏటీఎం వద్ద రూ.6 లక్షల నగదు డిపాజిట్ చేసేందుకు వెళ్లగా, దుండగులు అతడిపై 2 రౌండ్లు కాల్పులు జరిపారు. బుల్లెట్ కాలికి తగలడంతో గాయపడిన రిన్షద్ నుంచి నగదు బ్యాగును, ఆయన స్కూటీని లాక్కొని నిందితులు పరారయ్యారు. అయితే, ఈ ముఠాకు హైదరాబాద్‌లో ఆశ్రయం కల్పించి, దోపిడీకి సహకరించిన పాతబస్తీకి చెందిన ఒక వ్యక్తిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.


## మంచు తుఫానుతో అమెరికా అతలాకుతలం.. 10,000 విమానాలు రద్దు, స్తంభించిన జనజీవనం

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (కెరటం న్యూస్): అగ్రరాజ్యం అమెరికాలో మంచు తుఫాను అతలాకుతలం చేస్తుంది. రెండు వారాల కిందట బీభత్సం సృష్టించగా.. ఆ భయానక పరిస్థుల నుంచి కోలుకోక ముందే మరోసారి మంచు తుఫాను విరుచుకుపడింది. ముఖ్యంగా అమెరికా ఈశాన్య రాష్ట్రాలపై మంచు తుఫాను 'బాంబ్ సైక్లోన్' రూపంలో విరుచుకుపడుతోంది. న్యూయార్క్, బోస్టన్, మసాచుసెట్స్, రోడ్ ఐలాండ్ వంటి ప్రాంతాల్లో భారీ హిమపాతం నమోదైంది. ముఖ్యంగా రోడ్ ఐలాండ్‌లో దాదాపు 3 అడుగుల మేర మంచు కురిసి గత దశాబ్దాల రికార్డులను తిరగరాసింది. గంటకు 70 మైళ్ల వేగంతో వీస్తున్న బలమైన గాలుల కారణంగా రహదారులపై ఏమీ కనిపించని పరిస్థితులు ఏర్పడటంతో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.

ఈ ప్రకృతి వైపరీత్యం రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. భద్రతా కారణాల దృష్ట్యా శనివారం నుంచి మంగళవారం వరకు దాదాపు 10,000 విమాన సర్వీసులను విమానయాన సంస్థలు రద్దు చేశాయి. న్యూయార్క్, బోస్టన్ వంటి ప్రధాన నగరాల్లో రహదారులపై వాహనాల రాకపోకలపై అధికారులు కఠిన నిషేధం విధించారు. ఆమ్ట్రాక్ రైలు సర్వీసులు కూడా నిలిచిపోవడంతో వేలాది మంది ప్రయాణికులు విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లలోనే చిక్కుకుపోయారు.

తుఫాను ధాటికి విద్యుత్ లైన్లు తెగిపోవడంతో సుమారు 6 లక్షల ఇళ్లు, వ్యాపార సముదాయాలు అంధకారంలో మునిగిపోయాయి. ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని ప్రభుత్వం హెచ్చరించింది. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఇప్పటికే సెలవు ప్రకటించగా, మంచును తొలగించే పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. పరిస్థితులు చక్క బడటానికి మరో రెండు రోజులు పట్టవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

# బార్పేటా రోడ్‌లో సినిమా తరహా దోపిడీ



న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (కెరటం న్యూస్): ఇటీవల దేశవ్యాప్తంగా జరుగుతున్న దొంగతనాలు సినిమాలకు ఏ మాత్రం తగ్గకుండా పోలీసులతో పాటు ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. ఈ క్రమంలోనే పట్టపగలే అత్యంత సాహసోపేతంగా దోపిడీ జరిగింది. అస్సాంలోని బార్పేటా రోడ్ పట్టణంలో దుర్గాబారి రోడ్‌లోని 'సెన్కో అలంకార్' జ్యువెలరీ షోరూమ్‌లోకి కస్టమర్ల ముసుగులో ప్రవేశించిన ఐదుగురు దుండగులు, తుపాకులతో సిబ్బందిని హడలెత్తించారు. ఐదుగురు మహిళా ఉద్యోగులతో సహా ఎనిమిది మంది సిబ్బంది చేతులు, కాళ్లు కట్టేసి, నోళ్లకు టేపులు వేసి ఒక గదిలో బంధించారు.

సినిమా సీన్లను తలపించేలా సాగిన ఈ దోపిడీలో దుండగులు సాక్ష్యాలు దొరకకుండా సీసీటీవీ హార్డ్ డిస్క్‌లను కూడా ఎత్తుకెళ్లారు. మూడు రోజుల క్రితం ఈ ఘటన చోటు చేసుకోగా.. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆ వీడియోలో దుండగులు జ్యువెలరీ సిబ్బందిని బందించడం స్పష్టంగా కనిపించింది.

ఈ దోపిడీలో సుమారు 12 కోట్ల రూపాయల విలువైన బంగారు, వజ్రాల ఆభరణాలు, నగదును దోచుకెళ్లినట్లు షోరూమ్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేవలం అరగంట వ్యవధిలోనే పని ముగించుకున్న దుండగులు, వెళ్లేటప్పుడు షోరూమ్ షట్టర్లను బయట నుంచి లాక్ చేసి పరారయ్యారు. స్థానిక వ్యాపారస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఇంత పెద్ద దోపిడీ జరగడం స్థానికంగా కలకలం రేపింది.

కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. గోల్పారా జిల్లాలో జరిపిన ఆపరేషన్‌లో నలుగురు అనుమానితులను ఇప్పటికే అరెస్టు చేసినట్లు సమాచారం. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. దోచుకున్న ఆభరణాలను రికవరీ చేసేందుకు దర్యాప్తును వేగవంతం చేసినట్లు తెలుస్తుంది.

# బంగ్లాలో ఆర్మీలో భారీ మార్పులు.. ఇండియాలోని అధికారికి ప్రమోషన్!

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (కెరటం న్యూస్): బంగ్లాదేశ్ లో సమూల మార్పులు జరుగుతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగానే, ఈ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక లేటెస్ట్ గా బంగ్లాదేశ్ ఆర్మీలో కూడా భారీ మార్పులు జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. బంగ్లాదేశ్ కొత్త ప్రధానిగా తారిక్ రహమాన్ తాజాగా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ఆయన బంగ్లాదేశ్ సైన్యంలో కీలక మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

ముఖ్యంగా ఇండియాలోని అధికారికి ప్రమోషన్ ఇచ్చిందట. బంగ్లాదేశ్ డిఫెన్స్ అడ్వైజర్ గా ఉన్న మహమ్మద్ హాఫీజుర్ రెహమాన్ ను వెనక్కి పిలిపించి, కీలక పదవి కట్టబెట్టారు. ఆయనకు బంగ్లాదేశ్ మేజర్ జనరల్ గా ప్రమోషన్ కూడా ఇచ్చారు కొత్త ప్రధాని తారిక్. కొత్త సీజీఎస్ తో పాటు మిలిటరీ ఇంటలిజెన్స్ కు కూడా కొత్త అధికారులను తారిక్ రహమాన్ నియామకం చేశారట. కొత్తగా ఏర్పడ్డ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ప్రభుత్వం తన పట్టు పెంచుకునే దిశగా ఈ నిర్ణయాలు తీసుకుంటుందని అంటున్నారు. ఇది ఇలా ఉండగా 23 శాతం సీట్లు సాధించిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అధికారంలోకి వచ్చింది. 17 ఏళ్ల తర్వాత పీఠం దక్కించుకుంది.

## ఎయిర్ అంబులెన్స్ కూలిన ఘటనలో ఏడుగురు మృతి

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (కెరటం న్యూస్): జార్ఖండ్‌లోని ఛాత్రా జిల్లాలో కూలిన ఎయిర్ అంబులెన్స్ ఘటనలో ఏడుగురు మృతిచెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. విమానంలో ఉన్న ఏడుగురు మృతిచెందారని, ఆ విమానం రాంచీ నుంచి ఢిల్లీ వెళ్తున్నట్లు ఛాత్రా డిప్యూటీ కమీషనర్ కీర్తిశ్రీ తెలిపారు. సిమరియా వద్ద ఈ ప్రమాదం జరిగింది. మృతుల భౌతికకాయాలను పోస్టు మార్టమ్ నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. బీచ్‌క్రాఫ్ట్ సీ90 ఎయిర్ అంబులెన్స్‌ను రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్ సంస్థ ఆపరేట్ చేస్తున్నది. అటవీ ప్రాంతంలో ఎయిర్ అంబులెన్స్ కూలిందని, ఇద్దరు పైలెట్లతో సహా ఏడు మంది మరణించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఛాత్రాలోని సదర్ ఆస్పత్రిలో పోస్టు మార్టమ్ చేస్తున్నారు. ప్రమాద ఘటన పట్ల దర్యాప్తు మొదలుపెట్టారు.

రాంచీ విమానాశ్రయం నుంచి 7.11 నిమిషాలకు విమానం టేకాఫ్ తీసుకున్నది. 7.30 నిమిషాలకు ఏటీసీతో కాంటాక్ట్ తెగిపోయింది. అయితే బహుశా మేఘావృతమైన వాతావరణం వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని రాంచీ విమానాశ్రయ డైరెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కానీ ఇంత వరకు అధికారికంగా ఎటువంటి కారణం చెప్పలేదు. మృతుల్లో కెప్టెన్ వివేక్ వికాశ్ భగత్, కెప్టెన్ స్వరాజ్‌దీప్ సింగ్, సంజయ్ కుమార్, డాక్టర్ వికాశ్ కుమార్ గుప్తా, సచిన్ కుమార్ మిశ్రా, అర్చనా దేవి, దురుకుమార్ ఉన్నారు. వారణాసికి ఆగ్నేయంగా 100 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్నప్పుడు కోల్‌కతాలోని ఏటీసీతో ఆ ఎయిర్ అంబులెన్స్ కమ్యూనికేషన్ తెగిపోయినట్లు తెలిసింది. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో బృందం ప్రమాద స్థలానికి చేరుకున్నది.

# ఇన్ఫోసిస్‌లో రూ. 17 లక్షల ప్యాకేజీ.. బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి సూసైడ్

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (కెరటం న్యూస్): : తిరుపతిలో దారుణం చోటు చేసుకుంది. మోహన్ బాబు యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య అందరినీ కలచివేస్తోంది. కలల ప్రయాణం కావాల్సిన మా అమ్మాయి జీవితం ఇలా కన్నీటి కథగా మారిపోయిందని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఎంబీయూలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న భువన చదువులో ఎప్పుడూ ముందుండే విద్యార్థిని, క్లాస్ టాపర్. ఇటీవల రాసిన పరీక్షల్లో 96 శాతం మార్కులు సాధించి కుటుంబానికి గర్వకారణంగా నిలిచింది. అయితే, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో రూ.17 లక్షల ప్యాకేజీతో ఇన్ఫోసిస్ లో ఉద్యోగం కూడా సాధించింది. అంతా బాగానే ఉందనుకున్న సమయంలో ఒక్కసారిగా ఆమె జీవితం ఆగిపోయింది. ఎవరు ఊహించని విధంగా గత రాత్రి యూనివర్సిటీ సమీపంలోని ప్రైవేట్ హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడం కుటుంబాన్ని, స్నేహితులను షాక్‌కు గురి చేసింది. ఆశలు, ఆశయాలు నిండిన ఆ యువతి నిన్న చివరి సారిగా తల్లిదండ్రులకు ఫోన్ చేసి "మన సమస్యలు తీరిపోతాయి" అని చెప్పింది. ఇక, ఆ మాటలే ఇప్పుడు భువన తల్లిదండ్రుల హృదయాలను ముక్కలు చేస్తున్నాయి. రుయా మార్చురీ దగ్గర "మా అమ్మాయి ఎందుకు ఇలా చేసిందో అర్థం కావడం లేదు" అంటూ కన్నీటి పర్యంతం అవుతున్నారు. విద్యార్థిని మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలంటూ రుయా ఆసుపత్రి వద్ద విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి.

## "ఫేక్ న్యూస్‌పై ట్రంప్ ఫైర్.. జనరల్ కేన్‌పై ప్రశంసల జల్లు!

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (కెరటం న్యూస్): ఇరాన్‌తో యుద్ధం విషయంలో అమెరికా సైనిక నాయకత్వంతో ట్రంప్ కు విభేదాలు ఉన్నాయని అనేక వార్తలు వచ్చాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రచారం అవుతున్న తప్పుడు వార్తలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా జనరల్ డేనియల్ కేన్ (జనరల్ రజిన్) ఇరాన్‌పై సైనిక చర్యను వ్యతిరేకిస్తున్నారని మీడియాలో వస్తున్న కథనాలు 100 శాతం అబద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఎవరికైనా యుద్ధం ఇష్టం ఉండదని, అయితే ఒకవేళ సైనిక చర్య చేపట్టాల్సి వస్తే దానిని సులభంగా గెలవవచ్చని జనరల్ కేన్ అభిప్రాయపడినట్లు ట్రంప్ పేర్కొన్నారు. జనరల్ కేన్ సామర్థ్యాన్ని కొనియాడుతూ, గతంలో ఇరాన్ అణు కేంద్రాలపై జరిగిన 'ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్' కు ఆయనే నాయకత్వం వహించారని ట్రంప్ గుర్తుచేశారు. అమెరికాకు చెందిన శక్తివంతమైన బి-2 బాంబర్లు ఆ అణు కేంద్రాలను పూర్తిగా ధ్వంసం చేశాయని, అటువంటి గొప్ప పోరాట యోధుడు దేశం కోసం ఏ క్షణమైనా నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన వివరించారు. ఇరాన్‌తో పరిమిత దాడులు, యుద్ధం చేయకూడదనే ఉద్దేశ్యం జనరల్ కేన్‌కు లేదని, ఆయనకు కేవలం గెలవడం మాత్రమే తెలుసని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. అంతిమంగా యుద్ధం-దౌత్యపరమైన ఒప్పందంపై నిర్ణయం తీసుకునే అధికారం తనకే ఉందని ట్రంప్ స్పష్టం చేశారు. తనకు ఇరాన్‌తో చర్చల ద్వారా ఒప్పందం కుదుర్చుకోవడమే ఇష్టమని, కానీ ఒకవేళ అది సాధ్యం కాకపోతే ఇరాన్ దేశానికి అది చాలా దారుణమైన రోజు అవుతుందని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ ప్రజలు చాలా గొప్పవారని, వారు ఇటువంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావడం విచారకరమని పేర్కొంటూనే, అమెరికా సైనిక శక్తి గురించి ఆయన పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు.

## అన్‌లిస్టెడ్ కంపెనీల జాబితాలో రిలయన్స్ రిటైల్ అగ్రస్థానం

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (కెరటం న్యూస్): దేశీయ స్టాక్ మార్కెట్లో లిస్ట్ కాకుండా ఉన్న కంపెనీల్లో రిలయన్స్ రిటైల్ సంస్థ భారీ ఆదాయంతో అగ్రస్థానం సొంతం చేసుకుంది. మంగళవారం జేఎమ్ ఫైనాన్షియల్, హురున్ ఇండియా విడుదల చేసిన అన్‌లిస్టెడ్ జెమ్స్-2026 జాబితాలో రిలయన్స్ రిటైల్ రూ. 2.7 లక్షల కోట్ల భారీ ఆదాయంతో దేశంలోనే అతిపెద్ద అన్‌లిస్టెడ్ కంపెనీగా అగ్రస్థానంలో నిలిచింది. దీని తర్వాత రూ. 83,105 కోట్ల ఆదాయంతో ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ రెండో స్థానం దక్కించుకుంది. ఈ జాబితాలో దేశంలోని 100 పెద్ద అన్‌లిస్టెడ్ కంపెనీలు ఉన్నాయి, ఇవి ఒక్కొక్కటి కనీసం రూ. 1,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. జేఎమ్ ఫైనాన్షియల్, హురున్ ఇండియా నివేదిక ప్రకారం, రూ. 66,000 కోట్లతో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మూడో స్థానంలో ఉంది. ఈ వంద కంపెనీలు సంయుక్తంగా 2025లో రూ. 8.9 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయి. ఈ కంపెనీలన్నిటి విలువ రూ. 28.5 లక్షల కోట్లు. ఇవి దాదాపు 12 లక్షల మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. దేశంలో అన్‌లిస్టెడ్ కంపెనీలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, దేశ ఆర్థికవ్యవస్థలో బలమైన విభాగంగా మారాయని ఈ గణాంకాలు సూచిస్తున్నాయని, వీటిలో చాలావరకు భవిష్యత్తులో ఐపీఓలుగా వస్తాయని నివేదిక తెలిపింది. ఈ జాబితాలో కొన్ని కంపెనీలు చాలా వేగంగా అభివృద్ధి చెందాయి. టాటా ఎలక్ట్రానిక్స్ 3,173 శాతంతో రికార్డు స్థాయి వృద్ధి రేటును నమోదు చేయగా, టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ 904 శాతం, జేఎస్‌డబ్ల్యూ వన్ ప్లాట్‌ఫామ్‌లు 522 శాతం వృద్ధి చూశాయి. ఈ వృద్ధి ఎలక్ట్రానిక్స్ తయారీ, ఎలక్ట్రిక్ వాహనాలు, డిజిటల్ బీ2బీ ప్లాట్‌ఫామ్ వంటి రంగాలలో పెరుగుతున్న డిమాండ్‌ను చూపిస్తుందని నివేదిక పేర్కొంది.

# దేవాదుల సాక్షిగా పరిష్కారం సీఎం రేవంత్ రెడ్డి సెన్సేషనల్ ట్వీట్

మొదటి పేజీ తరువాయి

రాజీలేని పోరాటం చేస్తాం.. సీఎం రేవంత్

ఇటీవల దేవాదుల ప్రాజెక్టు సందర్శన సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కృష్ణా, గోదావరి నదుల నీటి వాటా విషయంలో రాష్ట్రాల మధ్య తలెత్తే అభిప్రాయ భేదాలను పంచాయితీల ద్వారా కాకుండా, స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకుంటామని అన్నారు. జలాల సాధనలో రాజీలేని పోరాటం చేస్తూనే, సామరస్యానికి పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు.

రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలు ఇలా..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాలు ప్రధానంగా కృష్ణా, గోదావరి నదీ జలాల పంపిణీ చుట్టూనే తిరుగుతున్నాయి. విభజన చట్టం ప్రకారం తాత్కాలికంగా ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలను కేటాయించారు. అయితే, తమకు సమాన వాటా కావాలని తెలంగాణ మొదటి నుంచీ డిమాండ్ చేస్తోంది. కృష్ణా జలాల వివాదాల పరిష్కారానికి బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని ట్రైబ్యునల్ విచారణ చేపట్టింది. ఈ క్రమంలో ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేయాలని తెలంగాణ కోరుతోంది. ఇక శ్రీశైలం, నాగార్జున సాగర్ డ్యామ్‌ల నిర్వహణ ఎవరి పరిధిలోకి రావాలనే దానిపై తరచుగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఇటీవల కేంద్రం వీటిని కెఆర్‌ఎంబి పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించింది.

అదేవిధంగా గోదావరిలో నీటి లభ్యత ఎక్కువగా ఉన్నప్పటికీ, ప్రాజెక్టుల నిర్మాణంపై అభ్యంతరాలు ఉన్నాయి. తెలంగాణ నిర్మిస్తున్న కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల వల్ల తమకు వచ్చే నీటి ప్రవాహం తగ్గుతుందని ఏపీ, అలాగే ఏపీ చేపట్టిన పోలవరం ఎత్తు, ముంపు ప్రభావంపై తెలంగాణ ఇలా పరస్పరం అభ్యంతరాలు లేవనెత్తుతున్నాయి. తాజాగా, ఏపీ ప్రభుత్వం తలపెట్టిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుపై కూడా తెలంగాణ ప్రభుత్వం కేంద్ర జలశక్తికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా, రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన ట్వీట్‌కు ఏపీ ప్రభుత్వం స్పందిస్తుందో లేదో వేచి చూడాల్సిందే మరి.

## 26/11 నిందితుడు తహవూర్ రాణాకు కెనడా షాక్.. పౌరసత్వం రద్దుకు రంగం సిద్ధం!

మొదటి పేజీ తరువాయి

పౌరసత్వ రద్దుకు కారణం ఇదే: కెనడా పౌరసత్వం కలిగి ఉన్న తహవూర్ రాణా పౌరసత్వాన్ని రద్దు చేయాలన్న కెనడా నిర్ణయం వెనుక ఉగ్రవాద ఆరోపణలు కాదని తెలుస్తోంది. కెనడా ఇమ్మిగ్రేషన్ విభాగం (ఐఆర్సీసీ) ప్రకారం ఆయన 2001లో కెనడా పౌరసత్వం పొందే సమయంలో తప్పుడు వివరాలు సమర్పించారనే ఆరోపణలతో ఈ చర్యలు తీసుకోబోతోంది. పౌరసత్వం కోసం సమర్పించిన దరఖాస్తులో తాను కెనడాలో నాలుగేళ్లపాటు నివసించానని, ఆ సమయంలో కేవలం ఆరు రోజులు మాత్రమే దేశం వెలుపల ఉన్నానని కెనడా అధికారులకు రాణా వెల్లడించారు. కానీ రాయల్ కెనడీ మౌంటెడ్ పోలీసుల దర్యాప్తులో రాణా ఆ సమయంలో ఎక్కువ భాగం అమెరికాలోని షికాగాలో గడిపినట్లు తేలింది. అక్కడ ఆయనకు సొంత ఆస్తులు మరియు వ్యాపారాలు (ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ, గ్రోసరీ స్టోర్) ఉన్నట్లు గుర్తించారు. ఇది తీవ్రమైన మరియు ఉద్దేశపూర్వక మోసంగా కెనడా ప్రభుత్వం ఆయన పౌరసత్వాన్ని రద్దు చేయాలని నిర్ణయించినట్లు ఈ కథనం పేర్కొంది.


గతేడాది భారత్‌కు అప్పగింత: 26/11 ఎటాక్ లో కీలక సూత్రధారిగా ఉన్న తహవూర్ రాణాను గతేడాది అమెరికా భారత్?కు అప్పగించింది. రాణాను తమకు అప్పగించాలంటూ భారత్ చాలా కాలంగా న్యాయపోరాటం చేసింది. అయితే భారత ప్రయత్నాలను సవాలు చేస్తూ అతడు పలు ఫెడరల్ కోర్టులతో పాటు శాన్‌ఫ్రాన్సిస్కోలోని యూఎస్ కోర్టును సైతం ఆశ్రయించాడు. ఆయా న్యాయస్థానాల్లో అతడికి చుక్కెదురైంది. ఈక్రమంలో అమెరికా సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేయగా అక్కడా నిరాశే ఎదురైంది. అక్కడ అతడికి ఉన్న చట్టపరమైన అవకాశాలన్నీ ముగిసిపోవడంతో గతేడాది అతడిని ఎన్ఐఏ అధికారులు భారత్ కు తీసుకువచ్చి విచారిస్తున్నారు.

# ఘోర అగ్నిప్రమాదం.. ఒకే ఇంట్లో ఆరుగురు సజీవదహనం

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (కెరటం న్యూస్): ఓ ఇంట్లో అగ్నిప్రమాదం చోటు చేసుకొని ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. లిసాడి గేట్ ప్రాంతంలోని ఇక్బాల్ అహ్మద్ అనే వ్యక్తి నివాసంలో రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు ఇంటికి మొత్తం వ్యాపించడంతో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో మహిళలు, చిన్న పిల్లలు కూడా ఉండటం స్థానికులను కలచివేసింది. రాత్రి 8:49 గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగినట్లు సమాచారం అందగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కుటుంబ సభ్యులను వెంటనే సివిల్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆరుగురు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మంటలు వేగంగా వ్యాపించడంతో వారు బయటకు రాలేకపోయారని పోలీసులు వెల్లడించారు. ఎస్పీ అవినాష్ పాండే ఆసుపత్రిని సందర్శించి బాధితుల వివరాలను ఆరా తీశారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో లిసాడి గేట్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు అధికారులు తెలిపారు.

## మూసీ నది ఒడ్డున గాంధీ విగ్రహ ఏర్పాటు తుషార్ గాంధీ ట్వీట్ వైరల్




న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (కెరటం న్యూస్): మూసీ పునరుజ్జీవన పథకం లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం 'గాంధీ సరోవర్' ప్రాజెక్టు కోసం వడివడిగా భూసేకరణ ప్రక్రియను చేపడుతున్నది. ఇప్పటికే భూసేకరణ నోటిఫికేషన్‌ను కూడా జారీ చేసి, అభిప్రాయ సేకరణ కోసం సమావేశాలను కూడా నిర్వహించింది. ఈ క్రమంలోనే భూసేకరణలో భాగంగా బండ్లగూడ జాగీర్ పరిధిలోని మధు పార్క్ రిడ్జ్ నిర్వాసితులు ఆందోళనకు దిగారు. దేశంలోనే అతిపెద్ద గాంధీ విగ్రహం ఏమో కానీ.. తాము చెట్టుకొకరు, పుట్టకొకరులా విడిపోయే పరిస్థితి వచ్చిందని పెద్దల నుంచి చిన్న పిల్లల వరకు సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఎం, సీఎంవోకు ట్యాగ్ చేస్తూ తుషార్ గాంధీ ట్వీట్..అయితే, 'గాంధీ సరోవర్' ప్రాజెక్టును ఉద్దేశించి గాంధీ మునిమనవడు తుషార్ గాంధీ సీఎం రేవంత్ రెడ్డితో పాటు, సీఎంవోను ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వేదికగా చేసిన ట్వీట్ ప్రస్తుతం విపరీతంగా వైరల్ అవుతోంది. గాంధీ విగ్రహ ఏర్పాటు కోసం ప్రజలను వారి నివాసాల నుంచి వెళ్లగొట్టడం అస్సలు సరికాదని అన్నారు. బాపు బతికి ఉంటే 'నా పేరు మీద ఇలాంటివి చేయొద్దు, వెంటనే ఆపండి' అని చెప్పేవారని పేర్కొన్నారు. విగ్రహాల కంటే ప్రజల కనీస అవసరాలే ముఖ్యమని గాంధీజీ నమ్మేవారని, అటువంటిది ఆయన విగ్రహం కోసమే పేదల ఇళ్లను తొలగించడం ఆయన సిద్ధాంతాలకు విరుద్ధం' అని తుషార్ గాంధీ ట్వీట్ చేశారు. ఇక తుషార్ గాంధీ చేసిన ట్వీట్‌కు నెటిజన్లు కూడా స్పందించారు. మానవతా దృక్పథంతో ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని కోరుతున్నారు. అభివృద్ధి, విగ్రహాల పేరుతో నిరుపేదలను ఇబ్బందులకు గురిచేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదనే మరికొందరు కామెంట్ చేస్తున్నారు.

# ఖమ్మం భూదాన్ భూముల్లో పేదల గుడిసెల కూల్చివేత

## ● కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం
## ● మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** ఖమ్మం కలెక్టరేట్ పరిధిలోని వెలుగుమట్లలో ఉన్న 60 ఎకరాల భూదాన్ భూముల్లో పదేళ్లుగా నివసిస్తున్న సుమారు 600 పేద కుటుంబాలపై వేలాది మంది పోలీసులతో దాడి చేసి, జేసీబీల సహాయంతో గుడిసెలను కూల్చివేయడం అమానుషం, క్రూరం, ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచే చర్య అని మాజీ మంత్రి లిపువ్వాడ అజయ్ కుమార్‌లి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా అక్కడే నివసిస్తూ తమకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటూ, న్యాయపరంగా పోరాడుతున్న పేదలపై ఈ విధంగా ప్రతాపం చూపించడం కాంగ్రెస్ ప్రభుత్వ అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని మండిపడ్డారు. హైకోర్టు స్టే పేరుతో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధి చేకూర్చేందుకు స్వయంగా మంత్రి రంగంలోకి దిగి పోలీస్ బలగాలను దుర్వినియోగం చేయడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. భూదాన్ భూములపై ఎప్పటినుంచో కన్నేసిన జిల్లా మంత్రి సన్నిహితులు వాటిని ఆక్రమించుకునేందుకు తెల్లవారుజామునే భారీ పోలీస్ బలగాలతో పేదల ఇళ్లను ఖాళీ చేయించడం నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. ఇళ్లు కూల్చివేసి నిరాశ్రయులను రోడ్డుపైకి నెట్టివేయడం మానవత్వాన్ని మరిచిన చర్యగా వారు అభివర్ణించారు. బీఆర్ఎస్ పార్టీ ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నదని స్పష్టం చేస్తూ, మాజీ శాసనసభ్యుడిగా, మాజీ జిల్లా మంత్రిగా ప్రజల తరపున అండగా తాను నిలుస్తూ న్యాయపరంగా మరియు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికారం ఉందని పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని విర్రవీగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన సమయంలో తగిన గుణపాఠం చెప్పక మానరని స్పష్టం చేశారు. వెంటనే కూల్చివేతలను నిలిపివేసి, అర్హులైన పేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# పెన్షనర్ల బకాయిలకై 20 వేల కోట్లు కేటాయించాలి

## వయో వృద్ధులైన పెన్షనర్ల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతే
## ఎస్జిపిఏటి రాష్ట్ర కార్యదర్శి మేరిఏసుపాదం



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** 2024మార్చి నుండి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిల చెల్లింపులకై రానున్న బడ్జెట్ లో ఇరవై వేల కోట్లు కేటాయించాలని ఎస్జిపిఏటి రాష్ట్ర కార్యదర్శి విమేరిఏసుపాదం డిమాండ్ చేసారు. పెన్షనర్ల బకాయిలు, పెన్షనర్లకు నగదురహిత వైద్యసేవలు, పెండింగ్ డిఆర్ మంజూరు, వెల్ నెస్ సెంటర్లలో మెరుగైన వైద్యసేవలు తదితర డిమాండ్స్ పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి) పిలుపు మేరకు మంగళవారం నాడు రెండోరోజు దీక్షలను మేరిఏసుపాదం ప్రారంభించి మాట్లాడారు. ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య అధ్యక్షతన జరిగిన పెన్షనర్ల రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పెన్షనర్ల వరుస మరణాలకు ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయం అన్నారు. రెండోరోజు మహిళా పెన్షనర్లు నిరాహార దీక్షలో కూర్చొనగా పెద్దసంఖ్యలో పెన్షనర్లు హాజరయ్యారు. పెన్షనర్ల న్యాయమైన సమస్యలు సత్వరం పరిష్కరించాలని, పెన్షనర్ల బకాయిల చెల్లింపునకై బడ్జెట్ లో నిధులు కేటాయించాలని, ఉద్యోగ విరమణ బకాయిలు అందక పదుల సంఖ్యలో పెన్షనర్లు మరణించారని, ప్రభుత్వం తక్షణం స్పందించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావు, జిల్లా అధ్యక్షులు రంజాన్, టిపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు పి. నాగిరెడ్డి,జిటిఏ నాయకులు నాగయ్య, టాప్రా నాయకులు రవికుమార్ తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ముందుగా ఈమధ్య కాలంలో పెన్షన్ బకాయిలు రాక మరణించిన పెన్షనర్ల చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. వయోవృద్ధులైన సీనియర్ పెన్షనర్లు కూతురు కృష్ణమూర్తి (80),కల్వకుంట్ల హనమంతరావు(75),పసుమర్తి రామచంద్రరావు (76) పెన్షనర్ల రిలేనిరాహార దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో రాయలరవికుమార్, విద్యాసాగర్, కృష్ణకుమారి, పెదమళ్ళసత్యనారాయణ,రామకోటేశ్వరరావు, రాధాకృష్ణ మూర్తి, ప్రసాదరావు, సుధాకర్, లక్ష్మసుజాత, అంజలి, అన్నమ్మ, ఉషారాణి, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# పేదల గుడిసెల కూల్చివేత కు కాంగ్రెస్ ,బి అర్ ఎస్, కమ్యూనిస్టు పార్టీలు కుమ్మక్కు

## బీజేపీ నాయకులు నున్నా రవికుమార్



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** ఖమ్మం కలెక్టరేట్కు కూతవేటు దూరంలో వెలుగుమట్ల పరిధిలో ఉన్న 62 ఎకరాల భూదాన్ భూముల్లో పేద ప్రజలు పదేళు ్లగా నివసిస్తున్న సుమారు 1000 కుటుంబాలను పట్టాలి ఇప్పిస్తామని చెప్పి అనేక మంది అమాయక ప్రజల దగ్గర లక్షలాది రూపాయలు గత పాలకులు బి అర్ ఎస్ నాయకులు కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పేద ప్రజలను దోచుకొని మోసం చేశారు. ఈరోజు వేలాది మంది పోలీసులతో దాడి చేసి, జేసీబీల సహాయంతో గుడిసెలను కూల్చివేయడం అమానుషం, కనీసం సామాన్లు తీసుకునే అవకాశం కూడా కల్పించకుండా వారికి సమయం కూడా ఇవ్వకుండా అతిక్రూరంగా ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచే చర్య అని బీజేపీ నాయకులు నున్నా రవికుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయక ప్రజలను మోసం చేసి మేము అధికారులకు వస్తే ఇళ్ల పట్టాలిస్తామని చెప్పి మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చాక ఇప్పుడు అమాయక ప్రజలను కరెంటు నీళ్లు బంద్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని

పదేళ్లుగా అక్కడే నివసిస్తూ తమకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటూ, న్యాయపరంగా పోరాడుతున్న పేదలపై ఈ విధంగా ప్రతాపం చూపించడం కాంగ్రెస్ ప్రభుత్వ అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని మండిపడ్డారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధి చేకూర్చేందుకు స్వయంగా ముగ్గురు మంత్రుల ఆదేశాలతో రంగంలోకి దిగి పోలీస్ బలగాలను మొహరించి గుడిసెలు కూల్చివేయడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు.

ఈ భూములపై కబ్జా చేయాలని ఇప్పుడు జిల్లాలో ముగ్గురు మంత్రులు గతంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మరియు కేటీఆర్ లు కుమ్మక్కై ఎప్పటి నుంచో వాటిని ఆక్రమించుకునేందుకు ప్రణాళిక తో పావులు కదుపుతూ ఈరోజు తెల్లవారుజామునే వేలాదిమంది పోలీస్ బలగాలతో పేదల ఇళ్లను ఖాళీ చేయించడం నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. ఇళ్లు కూల్చివేసి నిరాశ్రయులను రోడ్డుపైకి నెట్టివేయడం మానవత్వాన్ని మరిచిన చర్యగా వారు అభివర్ణించారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకులు

రాహుల్ గాంధీకి వేల కోట్ల రూపాయలు ఇవ్వటానికి పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి పేదలకు ఇల్లు ఇవ్వటానికి చేతులు రావడం లేదు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడే తీరు చూస్తుంటే ఈ తెలంగాణ రాష్ట్రాన్ని రాహుల్ గాంధీకి దోచిపెడుతున్నరు అని అన్నారు. భారతీయ జనతా పార్టీ ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నదని ప్రజల తరపున అండగా తాను నిలుస్తూ న్యాయపరంగా మరియు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికారం ఉందని పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని విర్రవీగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెప్పక తప్పదని స్పష్టం చేశారు.వెంటనే కూల్చివేతలను నిలిపివేసి, అర్హులైన పేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# వెలుగు మట్ల భూములు స్వాధీనం చేసుకున్నాం

## తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆదేశాల మేరకు
## అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
## ఆక్రమణదారుల సామాగ్రి అంబేద్కర్ భవనంలో భద్రపర్చాం
## వెలుగుమట్ల భూదాన్ భూములలో అక్రమ కట్టడాల తొలగింపుపై మీడియా సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆదేశాల మేరకు వెలుగుమట్ల భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెలుగు మట్ల భూదాన్ భూములలో అక్రమ కట్టడాల తొలగింపుపై లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిసిపి ప్రసాద రావుతో కలిసి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ 1953 లో కలవల రాజా రామారావు సర్వే నెంబర్ 147, 148,149 లో 31 ఎకరాల 7 గుంటల భూమి భూదాన్ ఉద్యమంలో దానం చేశారని తెలిపారు. భూ దాన్ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని గమనించిన ఖమ్మం అర్బన్ తహసిల్దార్ 2019 లో ఆక్రమణలు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారని తెలిపారు. ఖమ్మం అర్బన్ తహసిల్దార్ జారీ చేసిన నోటీసులను హైకోర్టులో చాలెంజ్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారని, హైకోర్టు తహసిల్దార్ కు భూదాన్ భూముల అంశంలో జ్యూరిస్డిక్షన్ సరిపోదని తెలుపుతూ తహసిల్దార్ ఆర్డర్ పై స్టే ఇస్తూ పిటిషన్ దారులు ఎట్టి పరిస్థితుల్లో కూడా భూదాన్ భూమి స్వభావాన్ని మార్చడానికి వీలులేదని తెలుపుతూ తీర్పు ఇచ్చిందని తెలిపారు. కొర్లపాటీ పరమేశ్వరి మరో 9 మంది పిటిషన్ దారులు కలిసి 2023 లో భూదాన్ భూములలో నిర్మించిన నిర్మాణాలను తొలగించకుండా ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్ దాఖలు చేశారని, దీనిపై హైకోర్టు స్పందిస్తూ కోర్టుకు సమర్పించిన పట్టా వివరాలు సరిగ్గా లేవని, భూదాన్ భూములలో పేదలు ఇండ్లు నిర్మించుకున్నట్లు దరఖాస్తు సమర్పించారని, పిటిషన్ దారులకు సంబంధించిన నిర్మాణాలను తొలగించవద్దని, నిర్మాణాలు లేకుండా మిగిలి ఉన్న భూమిలో ఎటువంటి కొత్త నిర్మాణాలు చేపట్టవద్దని స్టేటస్ కో జారీ చేసిందని అదనపు కలెక్టర్ తెలిపారు. తెలంగాణ భూదాన్ యజ్నా బోర్డు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టిందని, జనవరి 17, 2026 నాడు సంబంధిత పిటిషన్ దారులకు ఎటువంటి కేటాయింపులు చేయలేదని, 5 ఎకరాలు కేజీబీవీ పాఠశాలకు, 5 ఎకరాలు మోడల్ స్కూల్ కోసం మాత్రమే కేటాయింపులు చేసినట్లు తేల్చిందని అన్నారు. భూదాన్ భూములలో నివసిస్తున్న 308 ఆక్రమణదారులకు వెంటనే ఖాళీ చేయాలని జనవరి 17, 2026 న తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు నోటీసులు జారీ చేసిందని అన్నారు. వెలుగుమట్లలో కొంతమంది ఆక్రమణదారులు 2014 లో తమకు అలాట్మెంట్ వచ్చినట్లు కాగితాలు చూపిస్తున్నారని, రికార్డుల పరిశీలనలో ఎటువంటి అలాట్మెంట్ చేయలేదని తేలిందని తెలిపారు. తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఖమ్మం జిల్లా కలెక్టర్ కు సర్వే నెంబర్ 147, 148, 149 లో 2023లో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు రిట్ పిటిషనర్ ఆవుల శిరీష సంబంధించిన నిర్మాణాలు మినహాయించి మిగిలిన భూములు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని ఆదేశించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం పోలీస్ అధికారుల సహాయంతో వెలుగుమట్ల భూదాన్ భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం, హైకోర్టు లో పిటిషన్ దాఖలు చేసిన వారి నిర్మాణాలు మినహాయించి మిగిలిన అక్రమ నిర్మాణాలను తొలగింపు చేశామని అన్నారు. వెలుగు మట్ల భూదాన్ భూములలో ఎవరికి ఎటువంటి అలాట్మెంట్ ప్రభుత్వం చేయలేదని , ప్రభుత్వం ఏకపక్షంగా పేదల ఇండ్ల నిర్మాణాలు కూల్చి వేస్తున్నారని సామాజిక మాధ్యమాలలో వస్తున్న వార్తలలో వాస్తవం లేదని, పలు మార్లు రికార్డులు పరిశీలించి విచారణ చేసిన తర్వాత తెలంగాణ భూదాన్ బోర్డు ఆదేశాల మేరకు నేడు ఆక్రమణల తొలగింపు చేపట్టామని అన్నారు. జనవరి 17, 2026 నాడు తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆక్రమణదారులు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసిందని, ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోమని తెలిపినందున, తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆదేశాల మేరకు వెలుగుమట్ల భూ దాన్ భూములు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడానికి నేడు చర్యలు తీసుకున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు. అట్టి భూములలో కేజీబీవీ, ఆదర్శ పాఠశాల నిర్మాణానికి సంబంధించి కేటాయించిన 10 ఎకరాలు కాకుండా ఎటువంటి కేటాయింపులు చేయలేదని, ప్రస్తుతం ప్రభుత్వం ఆధీనం మాత్రమే చేసుకుందని, ఈ భూమి భవిష్యత్తులో ప్రజా ఉపయోగకరమైన కార్యక్రమాలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు వినియోగించడం జరుగుతుందని అన్నారు. సామాజిక మాధ్యమాలలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని అదనపు కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం నిరాశ్రయులైన వారికి కమ్మవారి సంఘంలో తాత్కాలిక వసతి ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ అన్నారు. భూదాన్ భూముల ఆక్రమణదారుల సామాగ్రి భద్రంగా అంబేద్కర్ భవనంలో స్టోర్ చేశామని, సంబంధిత ప్రజలు ఎక్కడికి ఆ సామాగ్రి తరలించాలంటే అక్కడికి తరలించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిసిపి ప్రసాద రావు మాట్లాడుతూ భూ దాన్ భూముల కేటాయింపు సంబంధించి ప్రజల నుంచి కొంతమంది అక్రమంగా డబ్బులు వసూలు చేసిన వారిపై కేసులు కూడా నమోదు చేయడం జరిగిందని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ పాత్రికేయులకు ఉన్న పలు సందేహాలకు సమాధానాలు తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్, కూరగాయల సాగు ద్వారా ఆర్థికాభివృద్ధి

## అశ్వారావుపేట ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త మజ్జిగ శ్రీనివాస్





**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** రైతులు ఆయిల్ పామ్‌తో పాటు కూరగాయలను అంతర పంటలుగా సాగు చేసి ఆదాయం పెంచుకోవాలని అశ్వారావుపేట ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త మజ్జిగ శ్రీనివాస్ అన్నారు. కామేపల్లి మండలం బాసిత్ నగర్ గ్రామంలో ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ పంట ప్రాముఖ్యత, సాగు పద్ధతులు, అధిక దిగుబడులు సాధించే విధానాలు మరియు ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించబడింది. కార్యక్రమానికి అశ్వారావుపేట ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త మజ్జిగ శ్రీనివాస్, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్, వైరా ఉద్యాన అధికారి ఆకుల వేణు, బాసిత్ నగర్ గ్రామ సర్పంచ్, వ్యవసాయ అధికారి తారదేవి, ఆయిల్ ఫెడ్ డిప్యూటీ మేనేజర్ శంకర్, ఏ.ఇ.ఓ.లు, హెచ్ఈఓ లు, గ్రొమోర్ ప్రతినిధులు మరియు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు. అశ్వారావుపేట శాస్త్రవేత్త మజ్జిగ శ్రీనివాస్, మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటలో అనుసరించాల్సిన శాస్త్రీయ సాగు విధానాలపై వివరించారు. ముఖ్యంగా ఎరువుల యాజమాన్యం, నీటి నిర్వహణ మరియు ఆల్పా గెలల కోత సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై రైతులకు సాంకేతిక సూచనలు అందించారు. జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నదని, రాబోయే 30-40 సంవత్సరాలపాటు ఈ పంటకు స్థిరమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రైతులు ఆయిల్ పామ్ సాగుతో పాటు కూరగాయలలో అంతర పంటలు చేపట్టి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. వైరా ఉద్యాన అధికారి ఆకుల వేణు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఆయిల్ పామ్ మరియు కూరగాయ పంటల సాగు ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి పెరిగినట్లు అధికారులు తెలిపారు.

## ఢిల్లీ యూత్ కాంగ్రెస్ నిరసన లో పాల్గొన్న జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయి





**న్యూ ఢిల్లీ బ్యూరో, కెరటం న్యూస్:** నేషనల్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఉదయ్ భాను చిబ్ ని ఇండియా AI ఇంపాక్ట్ సమ్మిట్ లో జరిగిన షర్ట్‌లెస్ ప్రొటెస్ట్ గురించి ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు దీనికి వ్యతిరేకంగా యూత్ కాంగ్రెస్ స్టేట్ ప్రెసిడెంట్ జక్కిడి శివచరణ్ రెడ్డి గారి ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్ల సాయి కుమార్ ఢిల్లీ ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆఫీస్ వద్ద “రిలీజ్ ఉదయ్ భాను” నినాదాలతో భారీ నిరసన లో పాల్గొనడం జరిగింది.

## తాతా మధుసూదన్ అక్రమ అరెస్టును ఖండించిన ముదిగొండ మండల కమిటీ

### వెంటనే విడుదల చేయాలని డిమాండ్

### బాధితులకు నష్టపరిహారం అందించాలి



**ముదిగొండ, కెరటం న్యూస్:** వెలుగుమట్ల బాది తులను పరామర్శించేందుకు వెళ్తున్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ శ్రీ తాత మధుసూదన్ గారిని పోలీసులు అడ్డుకొని అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ ముదిగొండ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది ఆయనను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు వెలుగుమట్లలో ఒక పది సంవత్సరాలు నుండి ఇళ్ల స్థలాలు లేని బాధితులు అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకొని స్థిర పడితే ఈ ప్రభుత్వం వారికి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఖమ్మం జిల్లాతో పాటు చుట్టుపక్క జిల్లాలోనీ పోలీసుల బలగాలని మోహరించి వారూ ఎప్పటినుండో వేసుకున్న ఇళ్లను ప్రోక్లైన్లతో ఈరోజు కూ ల్చడం అత్యంత దారుణం అన్నారు అందులో భాగంగానే వారిని పరామర్శించేందుకు వెళ్తున్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షు లు న విషయం తెలుసుకున్న ముదిగొండ మండల బీఆర్ఎస్ కమిటీ తీవ్రంగా ఖండించింది పార్టీ మండల అధ్యక్షులు వి లక్ష్మారెడ్డి మండల కార్యదర్శి గడ్డం వెంకట్ మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సీనియర్ నాయకులు బంక మల్లయ్య పో ట్ల వెంకటప్రసాద్ తోట ధర్మ చెరుకుపల్లి బిక్షం తదితర నాయకులు ఖండించిన వారిలో ఉన్నారు.

## ఉపవాసాల లక్ష్యం దైవభీతి



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** ఉపవాసాల లక్ష్యం దైవభీతి , తద్వారా మానవులలో నైతిక విలువల ప్రవర్తన తీర్చిదిద్దడం అని జమా ఆతే ఇస్లామీ హింద్ జిల్లా మహిళా పబ్లిక్ రిలేషన్ కన్వీనర్ హాజీరా సదఫ్ అన్నారు. జమాతే ఇస్లామి హింద్ సెంట్రల్ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం లో రాపర్తి నగర్ లో ఉన్న తెలంగాణ మైనారిటీ ఖమ్మం గర్ల్స్ కాలేజీ లో విద్యార్థులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ దైవభీతి జనింప చేసి నైతిక ప్రవర్తన తీసుకు రావడమే ఉపవాసం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆన్నారు. ఉపవాసం అనేది అన్ని మతాలవారు ఆచరిస్తారని అన్నారు. ఉపవాసం పాటించినప్పుడే మనిషిలో దైవభీతి నిగ్రహ శక్తి , సహనం పెరగడం తో పాటు మనిషికి అకలి భాధ తెలుస్తుందని అన్నారు ఇతరుల ఆకలి బాదను ఆర్థం చేసికోగల్గుతాడన్నారు. ఉపవాసం మనిషిని సంస్కరిస్తుందని, సంస్కారమైన వ్యక్తుల ద్వారానే సత్సమాజం ఏర్పడుతుందన్నారు, కాబట్టి ప్రతి ఉపవాసి మనోవాంచలకు దూరంగా వుడడంతో పాటు సమాజంలో మంచిని పెంచి , చె డు ను పారద్రోలే ప్రయత్నం చేయాలన్నారు. అంతిమ దైవ గ్రంథమైన ఖుర్అన్ అవతరించడం వల్లనే ఈ రంజాన్ నెలకు ఇంతటి ప్రాధన్యత చేకూరిందని, ఇది సమస్త మానవాళికి మార్గదర్శకమన్నారు. ఉపవాసం వల్ల శాస్త్రీయంగా లాభాలను గురించి వివరించారు అనంతరం కో కన్వీనర్ జహీరా ఫాతియా మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. కొత్త విషయాలు కంటే చదివిన వాటిని పదేపదే రివిజన్ చేయటం వల్ల గుర్తుండటం సులభతరం అవుతుందని అన్నారు ఆత్మవిశ్వాసంతో పరీక్షకు సిద్ధమై ఉత్తమ ఫలితాలు సాధించి మైనార్టీ గురుకుల కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమములో సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్, సభ్యులు నస్రీన్, సుమయ్య తరున్నం, కళాశాల ప్రిన్సిపాల్ అఖిల, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## పుర విధుల్లో డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

### క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాలపై ఆరా






**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సంఘటన్ శ్రీజన్ అభియాన్ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణా తరగతుల నాల్గవరోజులో భాగంగా ఐదుగురు జిల్లా అద్యక్షులు బృందం వికారాబాద్ ధరూర్ మండలం దోర్నాల గ్రామంలో పర్యటించి ప్రజా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన, సంక్షేమం,మరియు అభివృద్ధి పై గ్రామ ప్రజల అభిప్రాయ సేకరణ, వారి సలహాలు సూచనలు స్వీకరిస్తున్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ నూతి సత్యనారాయణ గౌడ్ఈ కార్యక్రమంలో వీరితో పాటు గద్వాల జిల్లా అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ కృష్ణ, గుడివాడ, కాకినాడ జిల్లా అధ్యక్షులతో కలిసి పాల్గొన్నారు.

## పేదల గుడిసెలు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా?

### భూదాన్ భూముల్లో ప్రభుత్వ చర్యను ఖండించిన ఎంపీ రవిచంద్ర



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** ఖమ్మం నగర శివారులోని భూదాన్ భూముల్లో పదేళ్లుగా నివాసం ఉంటున్న పేదల గుడిసెలను కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా కూల్చి వేయడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా ఖండిచారు. అక్కడ నివాసముంటున్న సుమారు 600 పేద కుటుంబాలపై వందలాది మంది పోలీసులు, పదుల సంఖ్యలో జేసీబీలు, ట్రాక్టర్లతో తెల్లవారు జామున్నే దాడి చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పదే పదే ఇందిరమ్మ రాజ్యం అని ప్రగల్బాలు పలికే కాంగ్రెస్ నేతలు.. పేదల ఇల్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటూ, న్యాయపరంగా పోరాడుతున్న పేదలపై ప్రభుత్వం దుర్మార్గంగా విరుచుకుపడటం ద్వారా కాంగ్రెస్ అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని మండిపడ్డారు. గుడిసెల తొలగింపును బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, బాధితులకు అండగా ఉంటామని ఎంపీ రవిచంద్ర హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద ప్రజలపై నిజంగా సానుభూతి ఉంటే తక్షణమే అక్కడి అర్హులైన పేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేయాలని వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు.

## ఇండ్ల కూల్చివేతను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన సిపిఎం నాయకుల అరెస్ట్

### టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్భందం

### అర్హులైన బాధితులకు స్థలాలు కేటాయించాలి



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** నగరంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల గుడిసెల కూల్చివేతను వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగిన సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్భందించారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్య అని సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాస్ రావు ఖండించారు. పదేళ్లుగా అక్కడే నివసిస్తూ జీవనం సాగిస్తున్న వందలాది పేద కుటుంబాలను ఒక్కసారిగా భారీ పోలీస్ బలగాలతో ఖాళీ చేయించడం సరైంది కాదన్నారు.పేదల నివాస హక్కును రక్షించాల్సిన ప్రభుత్వం, వారి ఇళ్లను కూల్చివేసి రోడ్డున పడేయడం అన్యాయమని విమర్శించారు. ఇండ్ల కూల్చివేతను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన శాంతియుత నిరసనలో పాల్గొన్న సీపీఐ(ఎం) నాయకులను అరెస్ట్ చేసి నిర్భందించడం సరైన కాదన్నారు. ఇదే సమయంలో కొంతమంది అరాచక శక్తులు ఈ ఇళ్ల సమస్యను ఆసరాగా చేసుకుని పేదల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తూ తప్పుడు హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన పేద కుటుంబాలందరికీ స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు తాత్కాలిక నివాసం, ఆహారం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నవీన్ రెడ్డి, భూక్యా శ్రీనివాస్ రావు, టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు కూచిపూడి నరేష్, వడ్లమూడి నాగేశ్వరరావు, మల్లికార్జున్ రెడ్డి, కొండం కరుణాకర్, పి సుభాష్, నల్లమల్ల సత్యనారాయణ, జట్ల ఆనందరావు పోటు హర్ష వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల గుడిసెల కూల్చివేత అమానుషం

### - మాజీ ఎంపీ నామ



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** ఖమ్మం నగర కార్పోరేషన్ పరిధిలోని వెలుగుమట్ల భూదాన్ భూములల్లో నివసిస్తున్న వందలాది పేదల గుడిసెలను కూల్చివేయడం అత్యంత దురదృష్టకరమని బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా ఆక్షేపించారు. ఏళ్ల తరబడి అక్కడ నివసిస్తూ జీవనోపాధి సాగిస్తున్న పేద కుటుంబాలకు ముందస్తు గా ప్రత్యామ్నాయ నివాసం కల్పించకుండా గుడిసెలను కూల్చివేసి వారిని రోడ్డున పడవేయడం అత్యంత దుర్మార్గమైన చర్య” అని నామ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పులు చేసి, చెమటోడ్చి కట్టుకున్న పేదల ఇళ్లను క్షణాల్లో నేలమట్టం చేయడం పేదల గుండెలను పగలగొట్టే చర్య అని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ కూల్చివేత సమయంలో మీడియాను కూడా రానివ్వకుండా అడ్డుకోవడం, పారదర్శకత లేకుండా చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. పేదలపై ఇలాంటి కఠిన చర్యలు తీసుకోవడం సరైంది కాదని, ప్రభుత్వానికి బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. భూదాన్ భూములల్లో నివసిస్తున్న వారి వివరాలు సమగ్ర సర్వే నిర్వహించి, అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు లేదా స్థలం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. పేద ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ నిలబడతుందని, వారి హక్కుల కోసం పోరాడతామని నామ స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలో అభివృద్ధి అవసరం ఉన్నప్పటికీ, అది పేదల జీవితాలను ఛిన్నాభిన్నం చేసేలా ఉండకూడదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పేదల గుడిసెల కూల్చివేత-కాంగ్రెస్ ప్రభుత్వ రాక్షస పాలనకు నిదర్శనం

### జడ్పి మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** ఖమ్మం కలెక్టరేట్ పరిధిలోని వెలుగుమట్లలో ఉన్న 60 ఎకరాల భూదాన్ భూముల్లో పదేళ్లుగా నివసిస్తున్న సుమారు 600 పేద కుటుంబాలపై వేలాది మంది పోలీసులతో దాడి చేసి, జేసీబీల సహాయంతో గుడిసెలను కూల్చివేయడం అమానుషం, క్రూరం, ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచే చర్య అని మాజీ జడ్పి చైర్మన్ లింగాల కమల్ తీవ్రంగా ఖండించారు పదేళు ్లగా అక్కడే నివసిస్తూ తమకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటూ, న్యాయపరంగా పోరాడుతున్న పేదలపై ఈ విధంగా ప్రతాపం చూపించడం కాంగ్రెస్ ప్రభుత్వ అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని లింగాల కమల్ రాజు మండిపడ్డారు. హైకోర్టు స్టే పేరుతో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధి చేకూర్చేందుకు స్వయంగా పోలీస్ బలగాలను దుర్వినియోగం చేయడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు.భూదాన్ భూములపై ఎప్పటినుంచో కన్నేసిన జిల్లా మంత్రి సన్నిహితులు వాటిని ఆక్రమించుకునేందుకు తెల్లవారుజామునే భారీ పోలీస్ బలగాలతో పేదల ఇళ్లను ఖాళీ చేయించడం నిరంకుశ రాక్షస పాలనకు నిదర్శనం అన్నారు. ఇళ్లు కూల్చివేసి నిరాశ్రయులను రోడ్డుపైకి నెట్టివేయడం మానవత్వాన్ని మరిచిన చర్యగా కమల్ రాజు అభివర్ణించారు.బేషరతుగా అరెస్ట్ చేసిన మా పార్టీ జిల్లా అధ్యక్షుడు,ఎమ్మెల్సీ తాత మధు గారిని మరియు పార్టీ నాయకులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## పసికందు మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

### బీసీ సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర శివాలయం లో కొంతమంది వ్యక్తుల ఘాతుకానికి బలై 2నెలల చిన్నారి మరణానికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించి,భవిష్యత్ లో ఇటువంటి సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల (ఆర్జేసి) కృష్ణ డిమాండ్ చేశారు.మంగళ వారం ఖమ్మం లో జరిగిన బీసీ కుల సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ దళిత,బీసీ కుటుంబాలకు చెందిన భార్యా,భర్తల పై కిరాతకంగా దాడి చేసి,చిన్నారి మరణానికి కారణమైన వారిపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం 10 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని,బీసీ ల రక్షణకు చట్టం చేయాలని డిమాండ్ చేశారు.బాదితుల పక్షాన నిలబడి వారికి అండగా నిలవాల్సిన పోలీసులు వారిపైనే కేసులు పెట్టడం శోచనీయం అన్నారు.చిన్నారి మృతికి కారణం అయిన వారిని శిక్షించే వరకు బీసీ సంఘాలు బాధిత కుటుంబానికి అండగా ఉంటాయని స్పష్టం చేశారు. చిన్నారి మృతి పై,గుడిలో జరిగిన ఘటన పై కుమ్మెర గ్రామం వెళ్ళి విచారణ చేసిన బీసీ కమిషన్ కు ధన్యవాదాలు తెలిపారు.అదేవిధంగా సంఘటన కు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించేలా కృషి చేయాలని కోరారు.ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల నాయకులు కూరాకుల నాగభూషణం,బొమ్మా రాజేశ్వర రావు, కత్తి నెహ్రూ, దొడ్డా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.